

# శకుంతల

కొంపెల్ల లక్ష్మీసమీరజ

చాలా రోజుల తరువాత ఆ గదిలో అడుగు పెట్టాను. ఎప్పుడో వేస్తూ మధ్యలో ఆపేసిన 'పెయింటింగు', కేన్వాసు మీద నుంచి నావంక దీనంగా చూస్తూ కనిపించింది! ఆ గదిలో అడుగుపెట్టి దాదాపు మూడు నెలలయిందేమో - అన్ని వస్తువులూ దుమ్ము కొట్టుకుని పోయి ఉన్నాయి. అక్కడక్కడ సిగరెట్ పీకలు ! ఇన్నాళ్లూ నా మనస్సును ఆవరించి ఉన్న శూన్యం ఇప్పుడిక్కడ ఈ గదిలో ప్రతిబింబిస్తూ కనిపించి ... నన్ను పరిహసిస్తూ నవ్విందేమో ననిపించింది ఒక్కక్షణం!

సిగరెట్ తాగాలనిపించి జేబులు తడుముకుంటే ఖాళీగా ఉన్నాయవి! చిరాకనిపించి, గబగబా వంటగదిలోకి వెళ్లి స్టవ్ మీద డికాక్షనుకి నీళ్లు పడేసి, బాత్రూంలో కెళ్లి కాళ్లు, చేతులు, ముఖం కడుక్కుంటుంటే ఆ చల్లదనానికి కాస్త పేద తీరినట్లయింది. అద్దం ముందు నిల్చుని తల దువ్వుకుంటుంటే సగం నెరిసిన జుట్టు నన్ను చూసి పలకరింపుగా నవ్వింది! ప్రతిరోజూ అనిపించే విషయమే ఇది - 'అనుభవాలు నిండిన గతం నెరిసిన జుట్టయితే, అంధకార బంధురమైన భవిష్యత్తు నల్లజుట్టట' అంటూ వార్థక్యం గురించి ఎవరో పెసిమిస్టు కవి చెప్పిన కవిత గుర్తొచ్చింది. వర్తమానంలోని చైతన్యం మర్చిపోయాడాయన పాపం!

కాఫీ కలుపుకుని, గ్లాసుతో హాల్లోకి వచ్చాను -

అప్రయత్నంగా "ఆమె" గుర్తొచ్చింది.

నేను వృత్తిరీత్యా డాక్టర్ని - ప్రవృత్తి రీత్యా పెయింటర్ని - డాక్టరుగా నా సబ్జెక్టు 'గైనకాలజీ'

ఒక పురుషుడినై ఉండి ఆ సబ్జెక్టు తీసుకోవటం - అందరికీ ఆశ్చర్యకరం గానే ఉంటుంది ఇప్పటికీ కూడా! అయితే నా కన్నా పదేళ్లు పెద్దదయిన మా అక్క, ఆ రోజుల్లో తనకి పిల్లలు పుట్టలేదన్న బాధతో ఆత్మహత్య చేసుకోవటం - నాకా సబ్జెక్టు మీద ఆసక్తిని పెంచింది ! ఏదో తెలియని కారణంగా మా అక్కలాగే మరికెందరు ఆ బాధతో సతమతమవుతున్నారో! నా వంతుగా నేను వాళ్లకు ఏమయినా చేయగలిగితే అది చాలు నాకు. అందుకే ఆ శాస్త్రంలో అంతుదొరకని ' అన్వేషణ'ను కొనసాగిస్తూనే ఉన్నాను.

డిగ్రీ నా చేతికొచ్చినది మొదలు నాలోని డాక్టరుకి పిల్లనిస్తామంటూ ఎన్నో సంబంధాలు వచ్చాయి నాకోసం ! అయితే నాలోని మరో మనిషయిన 'పెయింటరు' [illegible] రవివర్మ బొమ్మలతో ప్రేమలో పడిపోయి, అటువంటి అమ్మాయి కోసం అన్వేషణ'లో పడ్డాడు .

వైద్యశాస్త్రంలో 'అన్వేషణ'లాగే... చిత్రకారుడి 'అన్వేషణ' కూడా పూర్తి కాలేదు - వార్థక్యం వచ్చేయటంతో బ్రహ్మచారిగానే స్థిరపడి పోయాను రెండవ అన్వేషణకు- ఫుల్‌స్టాపు పెట్టేసి!

ధనకాంక్షతో కట్నం చాలక పెళ్లి చేసుకోవటం లేదంటూ ఒకప్పుడు నన్ను ఎగతాళి చేసిన ఈ సమాజం ... ఒక గైనకాలజిస్టుగా స్త్రీని నగ్నంగా చూసి చూసి విరక్తి పుట్టి... ఇలా బ్రహ్మచారిగా ఉండిపోయానని ఇప్పటికీ రంగు మార్చి వెక్కిరిస్తూనే ఉంది! రానురాను ప్రజల సంస్కారాలలో ఎటువంటి మార్పు వస్తున్నదో చూసి జాలిగా నవ్వుకుంటూ ఉంటాను ఆ మాటలను విన్నప్పుడల్లా. నాకు స్త్రీ గురించి కొన్ని నిశ్చితాభిప్రాయాలు ఉన్నాయి .

'పంచభూతాలనూ, ప్రకృతినీ, ఋతువులనూ సృష్టించిన తరువాత, బ్రహ్మదేవుడికి ఒక అపురూపమైన ఆలోచన కలిగింది - అన్నింటినీ కలిపి ఒకే రూపుగా తీర్చిదిద్దితే ఎలా ఉంటుంది' అని !

పర్వతాలూ, లోయలూ, పీఠభూములూ, మైదానాలూ, నదులూ, సముద్రాలు ... వంటి భౌగోళిక అందాలకు - భూదేవతంటి సహనం, ఆకాశమంత మనస్సూ, అగ్నివంటి తేజస్సూ, వాయువేగమంతటి ఆలోచనా, జలప్రవాహమంతటి శక్తి కలిపి కేవలం భౌతిక సౌందర్యమే కాక, అంతరంగ సౌందర్యం కూడా కలిగిన బొమ్మ తయారైంది! ఆనందంలో వసంతాన్ని, క్రోధంలో గ్రీష్మాన్ని, కరుణలో వర్షాన్ని, గాంభీర్యంలో శరత్కాలాన్నీ, తృప్తిలో హేమంతాన్ని అలకలో శిశిరాన్ని ప్రదర్శించగల ఆ బొమ్మకు 'స్త్రీ' అని పేరుపెట్టి ప్రాణప్రతిష్ఠ చేసి భూమికి ఆమెను వరపుత్రికగా పంపాడు బ్రహ్మదేవుడు- ఇది నా అభిప్రాయం !

అయితే స్త్రీ... పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పడి తన వ్యక్తిత్వాన్ని... ఔన్నత్యాన్నే కాదు... అస్తిత్వాన్ని కోల్పోతోంది ఇప్పుడు . వాత్సల్యానికి మారురూపమైన తల్లిగా క్షమా గుణానికి ప్రతిరూపమైన తోబుట్టువుగా, దాంపత్యంలో సహనశీలయైన అర్ధాంగిగా, ముద్దు ముచ్చటలతో అలరించే గారాల 'పట్టి'గా పురుషుడి జీవితాన్ని శాసించే స్త్రీ... భౌతిక సుఖ భోగవాంఛలతో ... సమాన హక్కుల పోరాటం పేరుతో ... తల్లి, తోబుట్టువు, భార్య, కూతురు గానే కాదు ఒక స్త్రీమూర్తిగా తన ముందు తానే ఓడిపోతోంది!




అబార్షన్స్ లీగలైజయిన తరువాత, నా దగ్గరకు వచ్చే, కాలేజీ... యూనివర్శిటీలలో చదివే ఆడపిల్లల సంఖ్య ఎక్కువయి పోయింది ! వాళ్లను చూస్తూ ఉంటే స్త్రీత్వం నైతికంగా ఎంత పతనమయి పోయిందో - అర్థమవుతోంది నాకు కొంత మంది రెండు మూడు సార్లు కూడా వచ్చే వాళ్లు ఉన్నా, వాళ్లకు నేను మంచి చెప్పబోతే... నన్నొక పిచ్చివాడిలా చూసి, హేళనగా నవ్వి వెళ్లిపోతూ ఉంటారు. ఆ కారణం చేతనేనేమో స్త్రీల మీద గౌరవం నశించి పోయింది నాకు! నాలో పెరిగిన ఈ 'మెటీరియలిజం'... యాంత్రికత కారణంగానేమో నాలో 'పెయింటరు' క్రమంగా గాఢ సుషుప్తిలోకి వెళ్లిపోయాడు!

సరిగ్గా ఈ పరిస్థితిలో నేనుండగానే.. మొన్న నా దగ్గరకు ఒక పేషెంటుగా వచ్చింది "ఆమె"!

ఆమె ఎవరో నాకు తెలియదు -

పేరు అంతకన్నా తెలియదు -

వయస్సూ తెలియదు -

కానీ 'ఆమె'ను చూడగానే మాత్రం మొట్టమొదటి సారిగా అనిపించింది - 'నాకింత కూతురు ఉంటే... అచ్చు ఇలాగే ఉండేదేమో' అని! అవును - నా జీవితంలో మొట్టమొదటిసారిగా అనుకున్నా మాట ...! అలా అనిపించటానికి కారణం, బహుశా - ఆమెను చూడగానే నాకు కాళిదాసు 'శాకుంతలం' జ్ఞాపకం రావటం కావచ్చు... బహుశా తిరువనంతపురం ఆర్ట్ గ్యాలరీలోని రవివర్మ చిత్రించిన 'శకుంతల' బొమ్మ గుర్తుకు రావటం కావచ్చు!

దర్భాంకురేణ చరణక్షత ఇత్యకాండే -
తన్వీక్షితాకతిధిదేవ పదానిగత్వా।
ఆసీపివృత్తవదనాచవిమోచయంతీ -
శాఖాసువర్కలమసక్తమపి ధృవాణాం ।

గౌతమి వెంట... అనసూయ, ప్రియంవదలు కబుర్లు చెపుతూ నవ్వుకుంటూ నడుస్తుంటే, వారిరువురి వెనుకా ప్రియంవద కుడిభుజాన తన కుడి చేతిని ఆన్చి, కాలిలో గుచ్చుకున్న ముల్లును ఎడమ చేతితో తీసుకుంటూ, వెనుదిరిగి, బేలగా కణ్వ మహర్షి వంక చూస్తున్న ముగ్ధ శకుంతల రూపు అది!

అచ్చు... ఆ చిత్రంలో శకుంతల కణ్వ మహర్షిని చూస్తున్నంత బేల గానూ చూసింది 'ఆమె' నా వంక- తన భర్తతో నా వద్దకు వస్తూ !ఇప్పటికీ ఆ దృశ్యం నాకు కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది ఆమెను తలచుకున్నప్పుడల్లా!

వాళ్లు నా దగ్గరకొచ్చిన కారణం మామూలే -

సంతాన రాహిత్యం -

పాత రిపోర్టులన్నీ క్షుణ్ణంగా పరిశీలించాను - ఒక్క 'ఆమె' పేరు తప్ప (నాకు ఆమె 'శకుంతల'గా ఉండటమే ఇష్టమనిపించి! అన్‌ఎక్స్‌ప్లెయినబుల్ ఇన్‌ఫెర్టిలిటీ - కారణం అంతుచిక్కని విషయం!

ఇద్దరిలో ఏ లోపమూ లేదు! అయినా పిల్లలు పుట్టలేదు... ! ఇది వాళ్లకే కాదు. నాకూ ఒక ఛాలెంజే!

అనుకున్నాను.

నేను ఈ సవాల్ని ఎదుర్కొని విజయం సాధించాలి.... పట్టుదలగా అనుకుంటూ రిపోర్టులు అతడి చేతికి అందించాను .

"ఫైనల్ టెస్టు కూడా పూర్తి చేసుకునే వచ్చారు నా దగ్గరకు - రిపోర్టులన్నీ చాలా సంతృప్తికరంగా ఉన్నాయి - 'ఇన్‌సెమినేషన్' చేసి చూద్దాం సక్సెస్ కావచ్చు! ముఖ్యంగా. మీ ఇద్దరూ నాకు సహకరించాలి! మానసికంగా ఏరకమైన ఒత్తిడీ ...ఆందోళన లేకుండా ఉంటే మన ప్రయత్నం తప్పక సఫలమవుతుంది!" కొంచెం గంభీరంగానే చెప్పాను ఇద్దరివంకా చూస్తూ .

అతడు చిన్నగా నవ్వాడు .

'ఆమె' తలదించుకుని ఉండటంతో ముఖంలోని భావం స్పష్టంగా తెలియలేదు నాకు!

మళ్లీ ఎప్పుడు రావలసిందీ చెప్పి పంపివేశాను వాళ్లను.

చిత్రంగా నిన్న 'ఆమె' ఒంటరిగా వచ్చింది నాదగ్గరకు

పేషెంట్లు అందరూ పూర్తయిపోయాక, చివరగా నా గదిలోకి వస్తూ "నమస్తే డాక్టర్"... అందామె.

ఒక్క క్షణం ఆమెను చూసి ఆశ్చర్య పోయాను.

"మీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలని ఈ వేళప్పుడు వచ్చాను. నాకు కొంచెం టైమివ్వగలరా?" అడిగింది నా ఎదురుగా వచ్చి.

"తప్పకుండా... కూర్చోండి" చెప్పాను కుర్చీ చూపుతూ.

విశ్రాంతిగా కూర్చుంది .

"మీరొక డాక్టరు... నేనొక పేషెంటుగా... నేను మీకు కొన్ని విషయాలు చెప్పాలి...! మేము వెళ్లిన ప్రతిచోటా డాక్టర్లు 'మానసికమైన ఒత్తిడి, ఆందోళన తగ్గించుకోవాలి' అని చెపుతున్నారు. నిన్న మీరు కూడా అదే మాట అన్నారు. చాలా రోజులుగా ఆ మాటలు విన్నాక నాకు కూడా కలిగిన సందేహం మిమ్మల్నడిగి తెలుసుకుం దామని వచ్చాను" నా వంక చూస్తూ చెప్పింది.

"చెప్పండి..." అన్నాను నేనూ విశ్రాంతిగా కూర్చుంటూ .

"మా తల్లిదండ్రులకి అమ్మాయిని నేనొక్కదాన్నే ! మానాన్న ఇంగ్లీషు లెక్చరర్.... నా చిన్నప్పుడు షేక్స్పియర్ నాటకాలు నాకు కథలుగా చెప్పేవారు తన పక్కలో పడుకోబెట్టుకుని... 'ఏజాఫ్ రొమాంటిసిజమ్'లోని కవుల గురించి చెప్తూ పద్యాలు నేర్పించారు ! వేసవి సెలవులలో సంస్కృతం నేర్పించేవారు... రామాయణ భారత భాగవతాలు, తెలుగు సాహిత్యం చదివించేవారు.... పేపరు చూడడం... వార్తలు విని రాజకీయాలు చర్చించటంతో మొదలయేది మా దినచర్య. మా అమ్మ కూడా నన్ను తన కూడా పెట్టుకుని తన పనిలో నాచేత సహాయం చేయించుకుంటూ నాకు పనులన్నీ నేర్పించింది. ఇద్దరికీ సంగీతం ఇష్టం కావటంతో నాకు నాలుగవ ఏట నుంచే వీణ నేర్పించారు.

ఇరవై సంవత్సరాల వయసు వచ్చేసరికి పొలిటికల్ సైన్స్, సైకాలజీ, ఇంగ్లీషు లిటరేచర్‌తో డిగ్రీ తీసుకున్నాను. పది పన్నెండు వీణ కచేరీలు చేశాను. ఎం.ఏ. ఇంగ్లీషు లిటరేచర్‌తో చేయాలని కాలేజీలో చేరాను. రెండవ సంవత్సరంలో ఉండగా ఒక వీణ కచేరీలో నన్ను చూసి వివాహం చూసుకుంటానని మా నాన్నగారి దగ్గరకు వచ్చారు నా భర్త. తనది మంచి ఉద్యోగమే కావటంతో మా వాళ్లకి అభ్యంతరం లేకపోయింది .

ఎం.ఏ. పరీక్షలు పూర్తి కాగానే నా పెళ్లి జరిగి పోయింది -


అమ్మ నాన్నగారు తప్ప మరోస్నేహితులు లేరు నాకు ! వీణ నా ప్రాణమే!

ఇల్లు, కాలేజీ, పుస్తకాలు తప్ప మరో ప్రపంచం తెలియదు నాకు!

మొత్తం ఆ వాతావరణాన్ని విడిచిపెట్టి విద్యార్థి దశనుంచి - ఇల్లాలు స్థాయిలో అత్తవారింట అడుగుపెట్టాను నా భర్త చేయి పట్టుకుని అతడి వెనకే .

మాది ఉమ్మడి కుటుంబం .

అత్తగారు, మామగారు, బావగారు, తోటి కోడలు పిల్లలు, ఆడబడుచు, మరిది, అందరం కలిసే ఉంటాము నాలుగు గదుల ఇంట్లో -




ఆడబడుచుకూ, మరిదికీ అప్పటికి పెళ్లి కాలేదు ఇంకా !

ఇంట్లో ఆడవాళ్లకి మడీ... ఆచారాలు ఎక్కువ !

అదీ ఎంత ఎక్కువంటే... రోజులో దాదాపు నాలుగైదు సార్లన్నా ప్రతిసారీ రెండు నిముషాలకు తక్కువ లేకుండా నగ్నంగా నిలబడేటంత ఎక్కువ! ఆచారాలకి... కర్టెన్లు పనికిరావు -

మా బావగారు... మామగారు ఊళ్లు వెడితే ఇంట్లో వంకాయలు కొనేవారు. మొదట్లో నాకు అర్థం కాలేదు వాళ్లకా కూర నచ్చక... వాళ్లు లేనప్పుడు వీళ్లు వండుకుని తినటానికి కొంటున్నారనుకున్నాను. వాళ్లు గుంభనంగా నవ్వుకుంటూ ఒకళ్ల నొకళ్లు వెక్కిరించుకుంటుంటే కూడా నాకు తెలియలేదు.

"మీ ఆయన ఊరెళ్లిన రాత్రి నీకు అర్థమవుతుందిలే" ' అంది మా ఆడబడుచు . ఆ తరువాత నేను వంకాయ వంక చూడటమే మానేశాను. అంతేకాదు - వాళ్లేం మాట్లాడినా నాకు వెలపరింతగానే అనిపించేది - రెండర్థాలు వినపడి ప్రతిమాటలోనూ!

రాత్రి రెండు నిమిషాల 'శారీరక అవసరానికి'... మా'మూడు' జంటలకీ, వంటగది వెనకాల ఉన్న గాలీ వెలుతురూ రాని స్టోర్‌రూమనబడే చీకటి కొట్టు ఉపయోగపడేది. ఆ ఇంటికి వచ్చిన కొత్తల్లో ఆ గదిలో ఉండగానే నా భర్తను అడిగాను - "మామగారికి పెన్షనొస్తుంది. బావగారు, మీరు, మరిది కూడా సంపాదన పరులే కదా. అందరికీ విడివిడిగా గదులు ఉండే పెద్ద ఇల్లు అద్దెకు తీసుకోవచ్చు గదా!" అని -

"మన పెళ్లికి ముందే మా అమ్మ నా మాట అడిగాను, "రెండునిమిషాల వ్యవహారాలకి విడిగా గదులెందుకు దండగ... రేపు మీ చెల్లెలు పెళ్లికి, అన్నయ్య పిల్లల మంచి చెడ్డలకీ డబ్బు దాచవద్దూ..." అంది" అన్నారు తను.

ఒకరోజు ఉదయమే నేను లేచేసరికి ఒకే దుప్పటి కింద మా అత్తగారు... మామగారు...! నా భర్త అప్పటికే లేచి పాల పేకెట్లు తీసుకు రావటానికి వెళ్లారు. మా ఆడబడుచూ... మరిదీ మెలకువగానే ఉన్నట్లుగా అనిపించింది. కళ్లు మూసుకునే ఉన్నా వాళ్లు అటూ ఇటూ కదులుతూ ఉండటంతో ! రెండు క్షణాలు నాకేం చేయాలో తోచలేదు. కడుపులో తిప్పినట్లయి లేచి బాత్రూంలో కెళ్దామని చూస్తే... స్టోర్‌రూమ్‌లో మా బావగారూ, తోటి కోడలు...! ఈ వాతావరణంలో పెరుగుతున్న మా బావగారి పిల్లలు - రేపు నాకు పిల్లలు పుడితే వాళ్లూఇక్కడే పెరగాలి...! తలుచుకోగానే అమాంతం వంట గదిలోనే భళ్లున వాంతయిపోయింది -

"ఒంట్లో బాగుండలేదా" అంటూ ఆ వెనకే వచ్చారు నా భర్త పాల పేకెట్లు తీసుకుని. తను ముందు గదిలో 'వాళ్లను దాటుకునే రావాలి..! అంటే తనూ చూశారు ఆ దృశ్యం...! మరోసారి కడుపులో కెలికినట్లు అయింది.

తరువాత నెమ్మదిగా నేను తనతో మళ్లీ అన్నాను మరో ఇంటికి మారటం సంగతి... ఆ రోజు నేను చూసిన

దృశ్యాల మాటను తనతో చెప్పి "అంత సీరియస్‌గా తీసుకోకూడదు అలాంటి విషయాలు... ఇటీజె బయోలాజికల్ నీడ్... కేవలం శారీరక అవసరం అది అంతే..." అన్నారు తను తేలికగా. అందరికీ తెలిసిన విషయాలే అవి.

మిగిలిన శారీరక అవసరాలకి బాత్రూము, లావెట్రీ ఉండగా ఆ అవసరానికి వేరేగది ఉండాలి కదా అంటావు నువ్వు. ఏదో రాత్రి పూట కళ్లు మూసుకుని రెండు నిమిషాలలో కానిచ్చే వ్యవహారానికి గది ఎందుకు అంటుంది అమ్మ. మీ ఇద్దరే తేల్చుకోండి అది. అమ్మ మారదామంటే నాకేమీ అభ్యంతరం లేదు ఇల్లు మారటానికి.

భార్యాభర్తల మధ్యన ఉండేది కేవలం 'కళ్లు మూసుకుని రెండు నిమిషాలు కానిచ్చే ఆ వ్యవహార' విషయమైన సంబంధమేనా?

మరి నేను ఎరిగున్న ప్రపంచం ఇలా లేదే - ఇదే నా సందేహం ! అయినా అలాగే ఆ మనుష్యుల మధ్య... ఆ ఇంట్లోనే మొన్నటి వరకూ గడిపాము -" చెప్పటం ఆపిందామె.

రెండు క్షణాల మౌనం తరువాత "డాక్టర్! మీరొక డాక్టరుగా... నేనొక పేషెంటుగా చెప్తానని చెప్పాను కదా ముందు... నేను అసభ్యంగా మాట్లాడుతున్నాని అనుకోవటం లేదుకదా మీరు అంది నెమ్మదిగా.


"లేదమ్మా.. చెప్పండి" చెప్పాను ఓదార్పుగా, ఆ అమ్మాయి పరిస్థితి నాకర్థమైంది.

"బ్రాహ్మణ కుటుంబాలలో ఆడవాళ్ల శృంగారమంతా వంటిళ్లు కడగటానికీ, పీటలు కడగటానికీ, మడి బట్టలు ఆరేసి... తీసి మడతలు పెట్టటానికి సరిపోతుందంటాడు చలం..." ఆమె మళ్లీ చెప్పటం ప్రారంభించింది.

"అలాగే... నా బాల్యం.. నా గతం అంతా మరచి పోదామ... నాదైన వ్యక్తిత్వం, ఇష్టాలు, అభిప్రాయాలు, భావాలు అణగదొక్కేసుకుని బ్రతికాను ఆ ఇంట్లోనేను... కేవలం నన్ను ప్రాణాధికంగా ప్రేమించిన నా భర్త కోసం - అయితే నా ప్రేమతో తనలోని పిరికితనమనే బలహీనతను మాత్రం వదిలించలేక పోయాను. అలా ఆ పరిస్థితులలో బ్రతకటం వలనే మాకు పిల్లలు పుట్టలేదు... అదృష్టం! ఈ మధ్యనే మాకు ఈ ఊరు బదిలీ అయింది - నాకు ఎన్నాళ్లనుంచో కోరిక నాకొక బిడ్డ కావాలి... ఆ బిడ్డకు మంచి సంస్కారం... నడవడి నేర్పి పెంచాలి నేను! నా ఆశయాలకు ప్రతిబింబంగా ఆ బిడ్డను మలిచి సమాజంలో అందరిచేతా 'శభాష్'నిపించుకోవాలి!

ఒక మనిషి తనను తాను మలచుకోవటం కాదు... మరో మనిషిని ఉన్నతమైన వ్యక్తిత్వంతో తీర్చిదిద్దటం గొప్ప పని! ఆ పని నేను చేయాలి... అందుకే నాకొక బిడ్డ కావాలి..." చెపుతోందామె!

"కానీ ఆ పరిస్థితులలో పెరగకూడదా బిడ్డ! అందుకే నేను కుటుంబ నియంత్రణ బిళ్లలు వాడాను. నా భర్తకు తెలియకుండా ఆమె తరువాత మాటలు నాకు



**కొత్త పాత మొగుడు**

**ఉమ :** మా ఆయన పెళ్లైనప్పటికి, ఇప్పటికి చాలా మారిపోయారు పిన్నిగారూ!

**శ్యామలమ్మ :** అదెలా?

**ఉమ :** పెళ్లైన కొత్తలో నాకంట్లో కన్నీళ్లు చూడలేకపోయేవారు.

**శ్యామలమ్మ :** మరిప్పుడో?

**ఉమ :** నాకంట్లో కన్నీళ్లు చూడకపోతే ఉండలేకపోతున్నారు

**శ్యామలమ్మ :** ఆఁ !!!

**- శశికళ (మద్రాసు)**

వినిపించలేదు.

నా మనోనేత్రాల ఎదుట ఒక అత్యద్భుత వర్ణచిత్రం గోచరించింది - 'ఒక చేత్తో సింహం జూలు పట్టి తలను వెనక్కి వంచి, మరొక చేత్తో ఆ సింహం నోటిలోని పళ్లను లెక్కిస్తున్న చిన్నారి భరతుడు... దూరం నుంచి ఆ దృశ్యాన్ని అపురూపంగా చూసుకుంటున్న శకుంతల...! అరె...! ఆ శకుంతల ఈమే...' అనుకుంటూ చటుక్కున కళ్లు తెరిచాను.

ఆమె చెప్పటం పూర్తయినట్లుందినా వంక చూస్తోంది. "నేను చేసిన పని తప్పా డాక్టర్" అన్నట్లుగా. చాలా సంవత్సరాల తరువాత నేను చూసిన పరిపూర్ణ వ్యక్తిత్వం కల స్త్రీ 'ఆమె'! ఆమె కొరకు నేను మాతంగ మహర్షివుతాను - చిన్నారి భరతుడు నా దగ్గరే జన్మించాలి...' అనుకుంటూ లేచి ఆమె దగ్గరకు వెళ్లాను

"నీకు తెలుసా అమ్మా... మహాపురుషులెప్పుడూ తల్లి ఆర్తిలో నుండి జన్మిస్తారట! నిజం. నీకు తప్పక ఒక మహాపురుషుడు జన్మిస్తాడు... నా మీద నమ్మకముంచు' ' చెప్పాను ఆత్మీయంగా ఆమె తల నిమురుతూ .

రెండు క్షణాల మౌనం తరువాత మెల్లగా లేచి నిల్చుంది తను .

రెండు చేతులూ జోడించి చెప్పింది కళ్లలో నీరు చిప్పిల్లు తుండగా -

"థాంక్యూ... థాంకూకా వెరీమచ్ డాక్టర్..."

ఆమె కళ్లలోని తడి నన్నొక్క క్షణం విచలితుణ్ణి చేసింది

"గతమంతా మరచిపోయి హాయిగా రెండెనెలలు జీవితాన్ని ఆనందంగా అనుభవించండి! ప్రస్తుతం ట్రీట్‌మెంటేదీ లేకుండా చూద్దామని చెప్తాను నీ భర్తతో ...! ఆ తరువాత మీ చేతికి మీ బిడ్డను అప్పగించే బాధ్యత నాది...' లాలనగా చెప్పాను.

వెంటనే వెళ్లిపోయింది తను ఆనందంగా -

స్త్రీ ప్రకృతికి ప్రతీక -

భౌతిక సౌందర్యం ... ఆకర్షణ శక్తి ఆమె లక్షణాలు!

ఆమె హృదయం సుసంపన్నమైనది... మేధస్సు అపారమైనది !

సాహసం ఆమె ప్రవృత్తి...!

అయితే, ఆమె మందహాసంలోని సృజనాత్మకతను, హృదయంలోని శక్తిని, వ్యవహారంలోని వాత్సల్యాన్ని అర్థం చేసుకోగలిగిన వాళ్లకే ఆమె అంతరంగంలోని సాహసం అర్థమవుతుంది! ఈ 'అహాన్ని' కాపాడు కునే ప్రయత్నంలోనే స్త్రీ 'అబల'గా అనిపిస్తుంది..! తనలోని మేధస్సును... సాహసాన్ని ముగ్ధత్వపు వలువలలో దాచి ఉంచి అమాయకంగా కనిపిస్తుంది!

కానీ ఆమెలోని అహం దెబ్బతిన్న మరుక్షణం... ఆమెలోని 'సాహసం' పాము పడగలా ఉవ్వెత్తున లేస్తుంది!

ప్రస్తుతపు సమాజంలో మారుతున్న సభ్యతలు, నాగరికత పేరుతో స్త్రీ యొక్క ముగ్ధత్వపు వలువలు ఒలిచి ఆమెను బజారు పాలు చేస్తుంటే... అలా 'అహం' దెబ్బతిన్న స్త్రీ నైతిక విలువలు విడిచి పెట్టేస్తోంది, తన భౌతిక అస్తిత్వం కాపాడుకోవాలన్న ప్రయత్నంలో..!

"కాపాడుకోవలసింది భౌతికమైన అస్తిత్వం కాదు... స్త్రీత్వం... స్త్రీగా నా వ్యక్తిత్వం...!! అంటున్న విలక్షణమైన నేటి స్త్రీ 'ఈమె'!

ఈమె వంటి వ్యక్తిత్వం ఎదుట... ఎంతటి పురుషుడైనా నమ్రతగా తలవంచవలసిందే.! "Frailty thy name is woman" అంటూ మిగిలిన వారిని చులకన చేసిన వాడైనా సరే!

మొన్నటి రోజున 'ఆమె' 'శకుంతల'ను జ్ఞప్తికి తెచ్చింది నాకు భౌతికంగా! నిన్న... ఉన్నతమైన సంస్కారంతో తన బిడ్డలను పెంచాలన్న తాపత్రయంతో ఉజ్వలంగా వెలిగే మరో తరానికి పునాది వేస్తూ దానికి ప్రతినిధియైన భరతుని మాతృమూర్తిగా దర్శనమిచ్చింది 'ఆమె' తనదైన వ్యక్తిత్వంతో!

అదే నాలో నిద్రించిన చిత్రకారుణ్ణి వెన్ను తట్టి మేల్కొలిపింది!

చకచకా ఆ గదిలోకి నడిచి, కిటికీ తలుపులు తెరిచి, కర్టెన్లు పక్కకు లాగాను. దుమ్ము దులిపి గదంతా శుభ్రం చేశాను. స్టాండుకు సరికొత్త కేన్వాసు నమర్చి, నా మనోనేత్రం ఎదుట నిన్న సాక్షాత్కరించిన చిన్నారి భరతుడి చిత్రం గీయటం ప్రారంభించాను - 'ఆమె' స్ఫూర్తితో -

అవును... మాతంగ మహర్షికొక్కడికే అర్థమయింది 'శకుంతల' మనస్సు.